### బంతిపూల సోయగం



బతుకమ్మ, దసరా, దీపావళి, షష్ఠివారాలకు ప్రత్యేకం బంతి పూలు. పూలను తీగల్లా అల్లి.. దేవతా విగ్రహాలు, నివాసాలను అలంకరిస్తే.. ఆ అందమే వేరు. పండుగల సందర్భంగా వీటికి భారీ డిమాండ్ ఉండడంతో మహారాష్ట్ర నుంచి వ్యాపారులు కేజీ రూ.80, రూ.100 చొప్పున తెచ్చి విక్రయిస్తుంటారు. అయితే, ముత్తారం మండలం మచ్చుపేట శివారులో ఓ రైతు సాగు చేస్తున్న ఆకర్షణీయమైన బంతిపూలు 'సాక్షి' కెమెరాకు చిక్కాయి. పండుగల సందర్భంగా తన తోటలోని బంతిపూలు కోసి మార్కెట్‌లో విక్రయిస్తే మంచి ఆదాయం వస్తోందని సదరు రైతు తెలిపాడు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

## న్యూస్‌రీల్

### దేశ సమగ్రత ముఖ్యం



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: అందరూ దేశ సమగ్రత, సమైక్యత చాటాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కోరారు. భారత తొలిహోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా పట్టణంలో జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌తో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన ఆశయాల సాధించాలని కలెక్టర్ కోరారు

### బ్యాంకు లావాదేవీలపై దృష్టి

జ్యోతినగర్(రామగుండం): బ్యాంకుల్లో అనుమానాస్పద లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించాలని రామగుండం అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ సూచించారు. ఎన్టీపీసీ టెంపరరీ టౌన్‌షిప్‌లోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అరుణశ్రీ మాట్లాడారు. ఖాతాదారు నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా జరిగే అనుమానాస్పద లావాదేవీలను గుర్తించి తనకు రోజూ నివేదిక సమర్పించాలమని ఆమె సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని బ్యాంకర్లతోపాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అధికారులు తిరుపతి, శైలజ పాల్గొన్నారు.

### 'పటేల్'కు నివాళి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం రాష్ట్రీయ ఏకతా దివస్ నిర్వహించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చిత్రపటానికి కమిషనర్ నాగేశ్వర్ పూలమాల వేసి నివాళి అర్పించారు. అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఎస్ఈ చిన్నారావు, డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ రాజేశ్వర్‌రావు, సూపరింటెండెంట్ మనోహర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

### సీఎమ్మార్ డెలివరీ చేయండి



మాట్లాడుతున్న శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో వానాకాలానికి సంబంధించిన సీఎమ్మార్‌ను నవంబర్ నెలాఖరు కల్లా డెలివరీ చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులతో ఆయన సమావేశమయ్యారు. బకాయిపడ్డ సీఎమ్మార్ డెలివరీ చేయడంలో అలసత్వం చేయొద్దన్నారు. జిల్లాలోని రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

### ఐక్యంగా ఉండాలి



రన్‌లో అధికారులు, ఉద్యోగులు

జ్యోతినగర్(రామగుండం): భారతదేశం ప్రత్యేకత భిన్నత్వంలో ఏకత్వమని ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు సీజీఎం కేదార్ రంజన్‌పాండు అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి నిర్వహించారు. యూనిటీ ఫర్ ఫ్రీడం రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ప్రతీఒక్కరు ఐక్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏజీఎం(హెచ్‌ఆర్)బిజయ్‌కుమార్ సిగ్దర్‌తో పాటుపలు ఉద్యోగ సంఘాల ప్రతినిదులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### సీఎం సభాస్థలి పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సర్దార్ రవీందర్‌సింగ్

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో ఈనెల 7న చేపట్టిన సీఎం కేసీఆర్ బహిరంగ సభ ఏర్పాట్లను సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ సింగ్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. వారివెంట నాయకులు అజయ్, మహేశ్, తిరుపతి, హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

# అసెంబ్లీ ఫలితాలపైనే 'గుర్తింపు' ఆశలు

- కార్మిక సంఘాలకు ప్రతిష్టాత్మకం
- మాతృ పార్టీల ప్రచారం కలిసి వచ్చేలా ముందుకు..
- వ్యూహాత్మకంగా గనులపై ఎన్నికల ప్రచారం
- రసవత్తరంగా 'సింగరేణి గుర్తింపు' ఎన్నికలు



గోదావరిఖని: అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అసెంబ్లీ ఎన్నికలు.. డిసెంబరులో నిర్వహించే సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే అసెంబ్లీ ఫలితాలపై సింగరేణి సంస్థలోని అన్ని కార్మిక సంఘాలు అనేక ఆశలు పెట్టుకున్నాయి. దీంతో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను కూడా మాతృత పార్టీలు ప్రతిష్టాత్మకంగానే తీసుకుని ఎన్నికల ప్రచారం ముమ్మరం చేస్తున్నాయి.

**ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకునే పనిలో యూనియన్ నేతలు**

- పలు కార్మిక సంఘాల నాయకులు తమ మాతృ పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకోవడానికి గనులు, డిపార్ట్‌మెంట్లలో విస్తృత ప్రచారం చేస్తున్నారు.
- వచ్చే డిసెంబర్–23వ తేదీన సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు.
- దీంతో ఈసారి అసెంబ్లీ ఎన్నికలకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది.
- సింగరేణి వ్యాప్తంగా సుమారు 42వేల మందికార్మికులు పనిచేస్తున్నారు.
- కోల్‌కారిడార్(పాత నాలుగు జిల్లాల్లో) ఎమ్మెల్యేల విజయంలో వీరిఓట్లే కీలకంగా మారనున్నాయి.
- ఈక్రమంలో అన్నిపార్టీలకు అనుబంధంగా కొనసాగుతున్న కార్మిక సంఘాలను ప్రచారంలో ముందుకు తీసుకొస్తున్నారు.
- ప్రధానంగా బీఆర్‌ఎస్‌కు టీబీజీకేఎస్, ఐఎన్‌టీయూసీకి కాంగ్రెస్, బీజేపీకి బీఎంఎస్, సీపీఎంకు సీఐటీయూ, సీపీఐకి ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాలుగా కొనసాగుతున్నాయి.
- దీంతో ఆయా యూనియన్ల ద్వారా మాతృ పార్టీలకు ఓట్లు రాబట్టాలనే వ్యూహంతో ముందుకు సాగుతున్నారు.
- దీంతో గనులపై యూనియన్లతో కలిసి గేట్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నారు.
- ఈక్రమంలో బీఆర్‌ఎస్‌కు అనుబంధంగా ఉన్న టీబీజీకేఎస్ ఇటీవలే అన్ని ఏరియాల్లో బీఆర్‌ఎస్ గెలుపొందేలా ప్రచారం విస్తృతంగా నిర్వహించాలని సెంట్రల్ కమిటీ సమావేశంలో తీర్మానించారు.
- ఈమేరకు 11ఏరియాల్లో ప్రచారం నిర్వహించాలని నిర్ణయించారు.
- అలాగే బీజేపీకి అనుబంధంగా కొనసాగుతున్న బీఎంఎస్ కూడా తన మాతృపార్టీ అభ్యర్థిని రంగంలో దింపుతోంది.
- ఐఎన్‌టీయూసీకి అనుబంధంగా ఉన్న కాంగ్రెస్ అభ్యర్థులు కూడా గనులపై ముమ్మరం ప్రచారం చేస్తున్నారు.

**డిసెంబర్ 23న 'గుర్తింపు' ఎన్నికలు**

సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల తేదీ కూడా ఇప్పటికే ఖరారైంది. ఈక్రమంలో నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికలు, డిసెంబర్ 3న అసెంబ్లీ ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. దీంతో అసెంబ్లీలో అడుగుపెట్టే అభ్యర్థులు ఖరారు కానున్నారు. గెలిచిన ఎమ్మెల్యేల సహకారంతో సింగరేణి సంస్థలో గుర్తింపు కార్మిక సంగం ఎన్నికల ప్రచారం నిర్వహించాలని కార్మిక సంఘాలు యోచిస్తున్నాయి. ఈక్రమంలో సింగరేణివ్యాప్తంగా ఉన్న ఉమ్మడి నాలుగు జిల్లాల్లో ఈసారి ఎన్నికలు అత్యంత కీలకంగా, ప్రతిష్టాత్మంగా మారనున్నాయి.

# విద్యావంతులను బరిలో దించిన బీఎస్పీ!

- ఉమ్మడి జిల్లాలో 10 మంది అభ్యర్థులను ఖరారు చేసిన పార్టీ
- తమతోనే సామాజిక మార్పు అంటున్న అభ్యర్థులు




దాసరి ఉష



నిశాంత్ కార్తికేయగౌడ్



ఎ.నరేశ్ యాదవ్



పిట్టల భూమేశ్



గోలి మోహన్



పల్లె ప్రశాంత్‌గౌడ్



కొంకటి శేఖర్



నిషాని రాముచంద్రం



నక్క విజయ్‌కుమార్



బి.మల్లేశ్‌యాదవ్

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఎన్నికల సమరంలో ఏనుగు పార్టీ దూకుడు పెంచింది. ప్రధాన పార్టీలకు దీటుగా అభ్యర్థులను ఎంపిక చేస్తూ అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటేందుకు కసరత్తు చేస్తోంది. కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 13 స్థానాలకుగాను రెండు విడతల్లో 10 మంది అభ్యర్థులను ప్రకటించింది. అభ్యర్థుల ఎంపికలో ఉన్నత విద్యావంతులు, యువతకు పెద్దపీట వేసింది. జనం నాడి పట్టుకొని, రాజకీయాల్లో తమ భవితవ్యాన్ని పరీక్షించుకునేందుకు వీరంతా సిద్ధమవుతున్నారు. సామాజిక మార్పు తమతోనే సాధ్యం అంటూ నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కరీంనగర్, మంథని అసెంబ్లీ స్థానాలకు ఎమ్మెల్యే అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు ప్రకటించిన వారిలో గౌడ్స్–2, యాదవ్–2, ముదిరాజ్–1, ఎస్సీ–3, మున్నూరుకాపు–1, పద్మశాలీ–1(మహిళకు) బీఎస్పీ సీట్లు కేటాయించింది.

**ఒక్కొక్కరిది ఒక్కో నేపథ్యం..**

పెద్దపల్లి అభ్యర్థి దాసరి ఉష ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. దాసరి పద్మ హనుమయ్య ట్రస్టు ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రామగుండం నుంచి బరిలో నిలిచిన అంబటి నరేశ్‌యాదవ్ సింగరేణి ఉద్యోగం వదిలిపెట్టి, ఆర్‌ఎఫ్‌సీఎల్ సహా సింగరేణి కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తూ ఇటీవల బీఎస్పీలో చేరారు. వేములవాడ అభ్యర్థి గోలి మోహన్ అమెరికాలో శాస్త్రవేత్తగా పని చేశారు. ప్రజాసేవ చేయాలన్న సంకల్పంతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి, సేంద్రియ సాగు వైపు అన్నదాతలను ప్రోత్సహించేలా, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నారు. జగిత్యాల అభ్యర్థి మల్లేశ్‌యాదవ్ ఎంపీటీసీ సభ్యుడిగా, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడిగా వివిధ హోదాల్లో పని చేస్తున్నారు. కోరుట్లలో కార్తికేయగౌడ్ తన తల్లి జెడ్పీటీసీగా పని చేయటంతో ఆమె బాటలోనే రాజకీయాల్లో ప్రవేశించారు. సిరిసిల్ల నుంచి పిట్టల భూమేశ్ రాష్ట్ర సర్పంచ్ ఫోరం సలహాదారుగా, పలు ప్రజాసమస్యలపై పోరాటాలతో గుర్తింపు పొందారు. ధర్మపురి అభ్యర్థి నక్క విజయ్‌కుమార్ టీ–మాస్(తెలంగాణ సామాజిక ప్రజాసంఘాల ఐక్యవేదిక) జగిత్యాల చైర్మన్‌గా, అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు.

**బీఎస్పీ అభ్యర్థుల విద్యార్హతలు**

దాసరి ఉష –పెద్దపల్లి
బీటెక్, ఐఐటీ, ఖరగ్‌పూర్
నిశాంత్ కార్తికేయగౌడ్– కోరుట్ల
బీసీఏ, ఎంఏలో ఫిల్మ్ మేకింగ్
అంబటి నరేశ్‌యాదవ్ –రామగుండం
పీజీలో రాజనీతిశాస్త్రం
పిట్టల భూమేశ్‌ముదిరాజ్– సిరిసిల్ల
ఎల్‌ఎల్‌బీ
గోలి మోహన్ –వేములవాడ
ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ
పల్లె ప్రశాంత్‌గౌడ్ –హుజూరాబాద్
– ఎంఏ ఎల్‌ఎల్‌బీ
కొంకటి శేఖర్ –చొప్పదండి
ఎంఎస్సీ బీఈడీ
నిషాని రామచంద్రం –మానకొండూర్
ఎల్‌ఎల్‌బీ
నక్క విజయ్‌కుమార్ –ధర్మపురి
ఏవియేషన్ డిప్లొమా
బల్కం మల్లేశ్‌యాదవ్ –జగిత్యాల– ఎస్‌ఎస్‌సీ

## మీ అభిమానం మరువలేనిది

- మంత్రి కొప్పుల ఈశ్వర్



మంత్రికి తిలకం దిద్దుతున్న మహిళలు

ధర్మారం: గ్రామస్తులు తనపై చూపుతున్న అభిమానం మరువలేనిదని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఎర్రగుంటపల్లిలో మంగళవారం మంత్రి సమక్షంలో రెడ్డి, పద్మశాలీ, యాదవ సంఘం ఆధ్వర్యంలో వందలాది మంది యువకులు, మహిళలు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి సీఎం కేసీఆర్ చేసి చూపించారని అన్నారు. తనకు మరోసారి ఓటువేసి గెలిపించాలని ఆయన కోరారు. నాయకులు ముత్యాల బలరాంరెడ్డి, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, గాగిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, రాసూరి శ్రీధర్, కూరపాటి శ్రీనివాస్, నాడెం శ్రీనివాస్, మాధవరావు, ఆవుల మల్లేశం, జీల్లా కనుకయ్య, ఎల్లాల చుక్కారెడ్డి, కొత్త మోహన్, కల్లెం నరేందర్‌రెడ్డి, సుమన్ శ్రీశైలం పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ మహామోసకారి

- మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం ఏది?
- కవితకు పదవులు ఇస్తే సరిపోతుందా?
- ఏఐసీసీ అధికార ప్రతినిధి డాలీశర్మ



మాట్లాడుతున్న డాలీశర్మ

పెద్దపల్లిరూరల్: 'తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ.. దీంతో రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందనుకుంటే.. సీఎం కేసీఆర్ కుటుంబం వద్ద బందీ అయింది' అని ఏఐసీసీ అధికార ప్రతినిధి డాలీశర్మ విమర్శించారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి ఆమె మాట్లాడారు. మేనిఫెస్టోలోని హామీలను అమలు చేయని మహామోసకారి సీఎం కేసీఆర్ అని దుయ్యబట్టారు. మహిళల ఆర్థికాభ్యున్నతికి కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయించి, మహిళా బ్యాంకు ఏర్పాటు చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. 'మహిళలకు 33శాతం రిజర్వేషన్ల అమలు అంటే.. నీ కూతురు కవితకు పదవులు ఇవ్వడమేనా?' అని నిలదీశారు. టీఎస్ పీఎస్సీ పరీక్షలు నిర్వహించి పేపర్ లీక్ చేసిన ఘనత బీఆర్‌ఎస్ సర్కార్‌కే దక్కిందని ఎద్దేవా చేశారు. పేదకుటుంబాలకు కేజీ టూ పీజీ ఉచిత విద్య అందిస్తామని ఇచ్చిన మాట తప్పారని విమర్శించారు. కాంగ్రెస్ పాలిత ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్, కర్ణాటక లాంటి రాష్ట్రాల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఇక్కడ ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. తమ పార్టీ అగ్రనేతలు ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అమలు చేస్తుందని భరోసా ఇచ్చారు. సర్వేలన్నీ తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని వెల్లడిస్తున్నాయని తెలిపారు. టీపీసీసీ కార్యదర్శి పెర్క శ్యాం, అధికార ప్రతినిధి వెంకటరమణ, కౌన్సిలర్లు సంపత్, సుభాష్‌రావు, నాయకులు శశిభూషణ్ కాచే, ఈర్ల స్వరూప, నూగిల్ల వీరేశం, బొడ్డుపల్లి శ్రీను, అస్లాం పాల్గొన్నారు.

## రక్తచరిత్ర సృష్టించేందుకు కాంగ్రెస్ యత్నం

రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: కాంగ్రెస్ పార్టీ రక్త చరిత్ర సృష్టించే ప్రయత్నం చేస్తోందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విమర్శించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాయలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభ్యర్థులను హత్యచేసి ఎన్నికల్లో విజయం సాధించాలనే కిరాతక విధానాలకు కాంగ్రెస్ పార్టీ పాల్పడుతోందన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అనేక ఏళ్లపాటు ఉద్యమించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్.. ఏనాడూ అహింసకు తావివ్వలేదని తెలిపారు. గత పదేళ్లలో మతకలహాలు, రాజకీయ హత్యలు లేకుండా పాలిస్తున్నారని చెప్పారు. ప్రజల్లో బీఆర్‌ఎస్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి, ఓటమి భయంతో కాంగ్రెస్ హింసాత్మక ఘటనలకు దిగుతోందని దుయ్యబట్టారు. రామగుండంలో ఒకప్పటి గూండాల రాజ్యం గుర్తుకు వచ్చే పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యానికి, ప్రశాంతతకు గొడ్డలిపెట్టు లాంటి హింసా రాజకీయాలను ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఖండించాలని ఆయన కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు తానిపర్తి గోపాలరావు, మాదాసు రామ్మూర్తి, తోడేటి శంకర్‌గౌడ్, నడిపల్లి మురళీధర్‌రావు, నూతి తిరుపతి, చిలకలపల్లి శ్రీనివాస్, మండ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## వలసలు వెళ్లే పరిస్థితి తెచ్చిన ఎమ్మెల్యే

- రామగుండం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్



మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: అభివృద్ధి చేయాల్సిన ఈప్రాంతాన్ని స్థానిక ఎమ్మెల్యే బొందల గడ్డగా మార్చి ప్రజలు వలసలు వెళ్లేలా చేశారని డీసీసీ అధ్యక్షుడు రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ఆరోపించారు. రామగుండం కార్పొరేషన్ 33వ డివిజన్‌లోని పరశురాంనగర్‌లో మంగళవారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఓసీపీ బ్లాస్టింగ్‌లతో ఇళ్ల గోడలకు పగుళ్లు వస్తున్నాయన్నారు. దుమ్ము, ధూళితో ఈప్రాంత ప్రజలు అనారోగ్యాలపాలవుతున్నారని తెలిపారు. ఉద్యోగాలు లేక యువకులు నిరుద్యోగులుగా మారి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగం కావాలంటే రూ.10 లక్షలు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఉందని ఆయన దుయ్యబట్టారు. మన ప్రాంతం సమస్యలు పరిష్కారం కావాలంటే.. కాంగ్రెస్ అధికారంలోకి రావాలని, నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ చేతి గుర్తుకు ఓటు వేసిగెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బండి రాము, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**ఒక్క అవకాశం కల్పించండి**


పాలకుర్తి(రామగుండం): ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్న తనకు ఒక్కసారి అవకాశం కల్పించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. బసంత్‌నగర్ సిమెంట్ కర్మాగారంలో ఏర్పాటుచేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కేశోరాం పర్మినెంట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దాడి మహేశ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు నగునూరి రమేశ్, చిప్ప రవి, జయ్యారం ఎంపీటీసీ గంగాధర రమేశ్ కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, నాయకులు పర్వేని శ్రీనివాస్, పాత రవీందర్ , పోతుల ప్రసాద్, చిట్టబోయిన రాజ్‌కుమార్, ఉరిమెట్ల రాజలింగం తదితరులు పాల్గొన్నారు. కాగా, కుక్కలగూడూరులో డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. మక్కాన్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

## టోల్‌ఫ్రీ 1950 నంబరుకు 1,045 ఫిర్యాదులు

పెద్దపల్లిరూరల్: ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై అందే ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తున్నామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. మంగళవారం జిల్లా ఎన్నికల ఫిర్యాదుల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉల్లంఘనలపై 1950 ద్వారా ఇప్పటివరకు 1045 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ప్రజలనుంచి అందే ప్రతీ ఫిర్యాదును రిజిస్టర్‌లో నమోదు చేసి సత్వరమే పరిష్కరిస్తున్నామని ఆయన చెప్పారు. సీ విజిల్ యాప్ ద్వారా కూడా ఫిర్యాదులు చేయవచ్చన్నారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ప్రచార గడువు ముగిసిన తర్వాత ర్యాలీలు, సభలు నిర్వహించినా, డబ్బు, మద్యం పంపిణీ చేసినా ఫిర్యాదు చేయాలని కలెక్టర్ సూచించారు.

## రూ.2లక్షల నగదు స్వాధీనం

ధర్మారం: జక్కన్నపల్లి గ్రామ శివారులో ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం మూడు వాహనాలు తనిఖీ చేశారు. అందులో రూ.2,03,500 నగదు లభించింది. మానకొండూరు మండలం అన్నారం గ్రామానికి చెందిన జంగాపూర్ ఖాసీలాల్ వద్ద రూ.70,000, బెజ్జంకి మండలం కల్లెపల్లి గ్రామానికి చెందిన గాయిని కనకయ్య వద్ద రూ.60,000, జూలపల్లి మండలం చీమలపేట గ్రామానికి చెందిన మీస శేఖర్ వద్ద రూ.73,500 లభించాయని ఎస్సై తెలిపారు. ఆ సొమ్మును స్వాధీనం చేసుకుని ఎఫ్‌ఎస్‌టీ బృందానికి అప్పగించినట్లు ఆయన వివరించారు.



అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు..
ఏ పాటి వాడో చూడు. ఎన్నుకుంటే
వెలగబెట్టడం కాదు.. ఇప్పటిదాకా
ఏం చేశాడో చూడు. పెట్టుకునే టోపీ
కాదు.. పెట్టిన టోపీ చూడు.
– కాళోజీ

## మీకు తెలుసా..?

### జెండాగద్దె లేని 'గంగిపల్లి'



మానకొండూర్: ప్రతీగ్రామంలో వివిధ రాజకీయ పార్టీల జెండాలు స్వాగతం పలుకుతుంటాయి. జెండాలు.. జెండా గద్దెల ఏర్పాటులో చిన్నపాటి యుద్ధాలే జరుగుతుంటాయి. అయితే కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం గంగిపల్లి గ్రామంలో ఇప్పటి వరకు ఒక్క రాజకీయ పార్టీ జెండా గద్దె లేకపోవడం విశేషం. గంగిపల్లి రాజకీయాలు తెలియని గ్రామం కాదు. గ్రామం నుంచి పేరున్న నేతలు పొలిటికల్‌గా రాణిస్తున్నారు. అయినా.. గ్రామ ప్రజల్లో ఉన్న ఐక్యత వీరి సామరస్యతకు చిహ్నంగా నిలుస్తోంది. మాజీ మంత్రులు ఎమ్మెస్సార్, చొక్కారావు, చెన్నమనేని విద్యాసాగర్‌రావు వంటి నేతలతో గ్రామస్తులకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. గ్రామానికి చెందిన కనకం నర్సయ్య నుస్తులాపూర్(ఇందుర్తికి ముందు) నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేశారు. గ్రామంలో ప్రస్తుతం ఐదువేల జనాభా, రెండు ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. రాజకీయ పార్టీల జెండాగద్దెల నిర్మాణాలతో ఇబ్బందులు ఉంటాయని, కలిసిమెలసి ఉన్నవాళ్ల మధ్య జెండా గద్దెల చిచ్చువద్దనుకుని ఏళ్లక్రితం గ్రామపెద్దలు నిర్ణయం తీసుకున్నారు. వారి నిర్ణయాన్ని ఇప్పటికీ పాటిస్తూ.. ఆదర్శంగా నిలుస్తున్నారు గ్రామస్తులు.

## క్లుప్తంగా

### సొంతగూటికి వాజిద్‌ఖాన్



పార్టీలో చేరిన వాజిద్ ఖాన్

రామగుండం: రామగుండం పట్టణానికి చెందిన నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాజిద్‌ఖాన్ వారం రోజుల క్రితం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పీసీసీ ప్రొటోకాల్ చైర్మన్ హర్కర వేణుగోపాల్‌రావు ఆదేశాలతో తిరిగి సొంతగూటికి చేరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్ రావు ఠాక్రే కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. రాష్ట్ర ఏఐసీసీ పరిశీలకుడు బోస్‌రాజ్, చేరికల కమిటీ చైర్మన్ జానారెడ్డి తదితరుల సమక్షంలో పార్టీలో చేరినట్లు వాజిద్‌ఖాన్ తెలిపారు.

### త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారిపై మంగళవారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ నుంచి కారులో వస్తున్న లక్ష్మీపతి మేడిపల్లిలో ట్రాఫిక్ సిగ్నల్ పడటంతో కారును నిలుపుతుండగా అదే మార్గంవైపు కట్టెల లోడుతో వస్తున్న లారీ కారును ఢీకొట్టగా.. కారు ముందున్న ట్యాంకర్‌ను ఢీకొంది. ట్యాంకర్, లారీ మధ్యలో కారు ఇరుక్కుపోవడంతో డ్రైవర్‌తో పాటు లక్ష్మీపతి క్షేమంగా బయటపడ్డారు. వారికి ప్రాణాపాయం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దీంతో రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోయింది.

### నియామకం




నియామకపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్ బాబు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రేశవేణి కేశవులను నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా నియమిస్తున్నట్లు మంగళవారం మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు తెలిపారు. ఈ మేరకు నియామకపత్రం అందజేశారు. ట్రేడ్ యూనియన్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ జనక్ ప్రసాద్, జిల్లా ప్రెసిడెంట్ వడ్డపల్లి దాసు మాట్లాడుతూ ఆర్జీ–2 ఏరియా సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కేశవులకు సూచించారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన నాయకులకు కేశవులు కృతజ్ఞతలు తెలిపారు.

# గల్లీ టు ఢిల్లీ

- పరిషత్ నుంచి పార్లమెంటు వరకు
- ఎంపీపీ, జెడ్పీటీసీ నుంచి ఎమ్మెల్యేలుగా..
- కౌన్సిలర్, కార్పొరేటర్ నుంచి చట్ట సభల్లోకి
- రాజకీయంగా రాణిస్తున్న ఉమ్మడి జిల్లా నేతలు



బండి సంజయ్ | గంగుల కమలాకర్ | పొన్నం ప్రభాకర్ | బొడిగె శోభ | చాడ వెంకట్‌రెడ్డి | మృత్యుంజయం | కోరుకంటి చందర్ | విజయరమణారావు

కరీంనగర్: రాజకీయ జీవితం వృక్షం లాంటిది. విత్తనం వేసిన రోజునుంచి దాన్ని కాపాడుకుంటూ వస్తేనే మానై నీడనిస్తుంది. రాజకీయం కూడా అంతే.. వేసిన తొలి అడుగు నుంచి వెనక్కి చూడకుండా.. గెలుపోటములకు భయపడకుండా ముందుకు సాగితేనే విజయం వరిస్తుంది. గల్లీలో ప్రారంభమైన విజయం ఢిల్లీ వరకు తీసుకెళ్తుంది. ఇలా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వివిధ పార్టీల నేతలు సర్పంచ్‌గా.. ఎంపీపీగా.. కౌన్సిలర్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, నేడు అసెంబ్లీ, పార్లమెంటులో తమ గళాన్ని వినిపిస్తున్నారు. 1987లో జరిగిన మొదటి ఎంపీపీ ఎన్నికల నుంచి ఇప్పటివరకు ఎంపీపీలుగా, జెడ్పీటీసీ సభ్యులుగా, కౌన్సిలర్, కార్పొరేటర్, పీఏసీఎస్ చైర్మన్లుగా తమ రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన నేతలు ఆ తర్వాత ప్రజల ఆశీస్సులతో చట్టసభల్లో అడుగుపెట్టారు. ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో తమదైన ముద్ర వేసుకున్నవారిలో కొందరిపై కథనం.

**అసెంబ్లీకి ఎన్నికైనవారు..**

- సంజయ్ విచార్ మంచ్ నుంచి 1983లో కరీంనగర్ ఎమ్మెల్యేగా గెలిచిన కటుకం మృత్యుంజయం మండల వ్యవస్థ ఏర్పడ్డాక ఓదెల జెడ్పీటీసీ సభ్యుడిగా గెలుపొందారు.
- కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్‌గా పని చేసిన కేతిరి సాయిరెడ్డి 1989 శాసనసభ ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు.
- కరీంనగర్ ఎంపీపీగా పని చేసిన జువ్వాడి చంద్రశేఖర్‌రావు 1994లో కరీంనగర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- మంథని ఎంపీపీగా గెలిచిన చందుపట్ల రాంరెడ్డి 1994లో మంథని ఎమ్మెల్యేగా విజయం సాధించారు.
- సుల్తానాబాద్ ఎంపీపీగా గెలిచిన బిరుదు రాజమల్లు 1994లో పెద్దపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- ప్రత్యక్ష పద్ధతిలో ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ చైర్మన్‌గా, ఎల్లారెడ్డిపేట జెడ్పీటీసీ సభ్యుడిగా గెలిచిన సుద్దాల దేవయ్య 1994, 1999లో నేరెళ్ల ఎమ్మెల్యేగా, 2009లో చొప్పదండి ఎమ్మెల్యేగా కొనసాగారు.
- ధర్మారం జెడ్పీటీసీ సభ్యుడిగా పని చేసిన గుజ్జుల రామకృష్ణారెడ్డి 1999లో పెద్దపల్లి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.
- మూడు సార్లు చిగురుమామిడి ఎంపీపీగా, ఒకసారి జెడ్పీటీసీ సభ్యుడిగా పని చేసిన సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి 2004లో ఇందుర్తి ఎమ్మెల్యేగా ఎన్నికై, సీపీఐ శాసనసభాపక్ష నేతగా పని చేశారు.
- మానకొండూరు జెడ్పీటీసీ సభ్యుడిగా, జెడ్పీ చైర్మన్‌గా కొనసాగిన ఆరెపల్లి మోహన్ 2009లో మానకొండూర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- శంకరపట్నం జెడ్పీటీసీ సభ్యురాలిగా గెలిచిన బొడిగె శోభ 2014లో చొప్పదండి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.
- జూలపల్లి జెడ్పీటీసీ సభ్యుడిగా గెలిచిన చింతకుంట విజయరమణారావు 2009లో పెద్దపల్లి ఎమ్మెల్యేగా విజయం అందుకున్నారు.
- మంథని ఎంపీపీగా, జెడ్పీటీసీ సభ్యుడిగా పని చేసిన పుట్ట మధు 2014లో మంథని ఎమ్మెల్యేగా విజయం సాధించారు.
- జూలపల్లి జెడ్పీటీసీ సభ్యుడిగా ఉన్న కాశిపేట లింగయ్య 2004లో నేరెళ్ల ఎమ్మెల్యేగా గెలిచారు.
- సింగిల్‌విండో చైర్మన్‌గా పని చేసిన పొన్నం ప్రభాకర్ కరీంనగర్ ఎంపీగా 2009లో పార్లమెంటులో అడుగుపెట్టారు.

**కార్పొరేటర్ స్థాయి నుంచి..**

- కరీంనగర్ కౌన్సిలర్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా పని చేసిన కఠారి దేవేందర్‌రావు 1999లో కరీంనగర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- కరీంనగర్ ఎమ్మెల్యేగా మూడుసార్లు విజయం సాధించిన మంత్రి గంగుల కమలాకర్ కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా పని చేశారు.
- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కార్పొరేటర్‌గా పని చేశారు.
- రామగుండం మున్సిపల్ చైర్మన్‌గా పని చేసిన సోమారపు సత్యనారాయణ రామగుండం ఎమ్మెల్యేగా కొనసాగారు.
- వేములవాడ జెడ్పీటీసీ సభ్యుడిగా గెలిచిన గొడిశాల రాజేశంగౌడ్ జెడ్పీ చైర్మన్‌గా, జగిత్యాల ఎమ్మెల్యేగా, ఎన్టీఆర్ కేబినెట్‌లో గృహ నిర్మాణశాఖ మంత్రిగా పని చేశారు.

## బొగ్గు బాయి

# వారసత్వ ఉద్యోగాలు సాధించిన ఘనత కేసీఆర్‌దే

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: కాంగ్రెస్ ప్రభుత్వం పోగొట్టిన వారసత్వ ఉద్యోగ హక్కును మెడికల్ ఇన్వాలిడేషన్ పేరుతో సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు సాధించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని రామగుండం నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. మంగళవారం వకీల్‌పల్లిగనిపై జరిగిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కార్మికుల ఉద్యోగ విరమణ వయస్సును 61 సంవత్సరాలకు పెంచారన్నారు. దేశ సరిహద్దుల్లో కాపలాకాసే సైనికులతో సింగరేణి కార్మికులు సమానమని, ఐటీ రద్దుకోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తే, కేంద్ర ప్రభుత్వం దానికి ఆమోద ముద్ర వేయలేదన్నారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, నాయకులు మూల విజయారెడ్డి, ఐలి శ్రీనివాస్, జాహిద్‌పాషా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

# ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఎగురవేస్తున్న ఏఐటీయూసీ నాయకులు



జెండా ఆవిష్కరించిన నాయకులు

గోదావరిఖని: ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను భాస్కర్‌రావు భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యాలయంలో జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, కె.స్వామి, గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, కే.కనకరాజు, తాళ్లపెల్లి మల్లయ్య, బోయిన స్వామి, ఆకునూరి శంకరయ్య, ఆసాల రమ, ఆఫీస్ కార్యదర్శి రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం యూనియన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు ఎల్ ప్రకాశ్ జెండా ఆవిష్కరించగా నాయకులు మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రాజారత్నం, రవీందర్, అన్నారావు, తిరుపతి, వెంకటేశ్వర్లు, రాజయ్య, కుమారస్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**జెండావిష్కరణ**

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో మంగళవారం ఏఐటీయూసీ 104వ వార్షికోత్సవం సందర్భంగా జెండాను ప్రధాన కార్యదర్శి సునీల్ ఆవిష్కరించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. కార్మిక సంక్షేమం, వారి సమస్యల సాధన, కార్మికుల హక్కులను సాధించేందుకు ఏఐటీయూసీ అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. నాయకులు తిరుపతి, శ్రీనివాస్, పోచమల్లు, తిరుపతి తదితరులున్నారు.

# నాణ్యమైన బొగ్గు సరఫరాతోనే లాభాలు

- రక్షణ కమిటీ కన్వీనర్ సూర్యనారాయణరాజు



సీఎస్పీకి షీల్డ్ అందజేస్తున్న కమిటీ బృందం

గోదావరిఖని: నాణ్యమైన బొగ్గు సరఫరాతోనే సంస్థకు లాభాలు చేకూరుతాయని రక్షణ కమిటీ కన్వీనర్ ఓసీపీల జీఎం సూర్యనారాయణ రాజు పేర్కొన్నారు. 54వ వార్షిక భద్రత పక్షోత్సవాల సందర్భంగా ఆర్జీ–1 సీఎస్పీలో రక్షణ కమిటీ తనిఖీ చేసింది. ఈ సందర్భంగా పని స్థలాలను పరిశీలించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బహుమతి అందజేశారు. అదేవిధంగా రాత్రి ప్లాంట్‌లోని వివిధ ప్రాంతాలను సందర్శించారు. వ్యక్తిగత భద్రత పాటిస్తూ సంస్థ అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ రాంమూర్తి, రక్షణ కమిటీ సభ్యులు నరేంద్రకుమార్, మేనేజర్ డి.రమేశ్‌బాబు, పి.శ్రీనివాస్, కె.ఆంజనేయ ప్రసాద్, హెచ్ఓడీ దాసరి శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాసరావు జాతీయ సంఘాల నాయకులు, కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# కార్మికులను పర్మినెంట్ చేయండి



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కోల్‌సిటీ: వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో మంగళవారం నిర్వహించిన 103వ ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలకు ఏఐటీయూసీ రాష్ట్రసమితి సభ్యులు శనిగరపు చంద్రశేఖర్, రామగుండం నగర అధ్యక్షుడు అబ్దుల్ కరీం పాల్గొన్నారు. ముందుగా ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించి, ఉద్యోగులు, కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేసేందుకు, 44 కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు కార్మికవర్గం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, వైనాల రవి, అన్వర్, విజయ, వసంత, సౌందర్య, విజయలక్ష్మి, మేరీ, రుద్రమదేవి, మతీనా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టుకు చేరిన 'మానేరు' వివాదం



మానేరును పరిశీలిస్తున్న డీపీవో చంద్రమౌళి(ఫైల్)

ముత్తారం: పెద్దపల్లి జిల్లా ఓడేడ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి మానేరులో టోల్‌గేట్ వద్ద వసూళ్ల వివాదం హైకోర్టుకు చేరింది. టోల్‌గేట్ వద్ద సొమ్ము వసూలు చేసుకునేందుకు ఓడేడ్‌కు చెందిన ఓ వ్యక్తి సుమారు రూ.18లక్షలకు వసూలు హక్కులను వేలం పాటలో దక్కించుకున్నారు. అయితే, వాహనాదారుల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్నారని వివిధ స్థాయిల్లోని అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అయినా, స్పందన రాలేదు. దీంతో మంథనికి చెందిన ఇనుముల సత్యనారయణ 2022లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈక్రమంలో విచారణ జరపాలంటూ అక్టోబరు 10న హైకోర్టు పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు పెద్దపల్లి జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి ఈనెల 25న పరిశీలన చేశారు. ఈవిషయంపై డీపీవో చంద్రమౌళిని సంప్రదించగా.. మానేరులో టోల్‌గేట్ వసూళ్లపై విచారణకు హైకోర్టు నుంచి పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఉత్తర్వులు అందాయన్నారు. ఆయన ఆదేశాల మేరకు మానేరును పరిశీలించామని, గతంలో ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌కు గ్రామపంచాయతీ అనుమతి లేదని తెలిపారు. ప్రస్తుతం టోల్‌గేట్ లేదని, స్థానికుల రవాణా సౌకర్యం కోసం ఏటా టోల్‌గేట్ ఏర్పాటు చేస్తారని అన్నారు. అక్రమంగా వసూలు చేస్తారనే విషయం తనకు తెలిసిందని, నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

# సామరస్యంతోనే సమస్యలు పరిష్కారం



ప్రజాప్రతినిధులు, కులసంఘాల కమిటీలతో సమావేశమైన ఏసీపీ మహేశ్

కాల్వశ్రీరాంపూర్: సామరస్యంతోనే ఏ సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని ఏసీపీ ఎడ్ల మహేశ్ అన్నారు. రామగుండం సీపీ, పెద్దపల్లి డీసీపీ ఆదేశాల మేరకు కొనేళ్లుగా కాల్వశ్రీరాంపూర్ జమ్మి పూజ స్థల వివాదంపై మంగళవారం పోలీసులు గ్రామంలోని ప్రజాప్రతినిధులు, వివిధ కులసంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దసరా సందర్భంగా శమీపూజ నిర్వహించే స్థలం విషయమై ఓ సామాజిక వర్గంతోపాటు గ్రామస్తులకు వివాదం జరుగుతోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జమ్మి స్థలం వద్ద ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన పోలీసులు గ్రామస్తుల నుంచి ఏకాభిప్రాయం తీసుకున్నారు. ఇకనుంచి జమ్మిపూజ యథావిధిగా కొనసాగించుకోవాలని గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అందరి సమక్షంలో జమ్మిపూజ చేసే స్థలం కోసం ముగ్గుపోశారు. సమావేశంలో సుల్తానాబాద్ సీఐ జగదీశ్, కాల్వశ్రీరాంపూర్ ఎస్సై శ్రీనివాస్, సర్పంచ్ ఆడెపు శ్రీదేవి రాజు, వైస్ ఎంపీపీ జూకంటి శిరీష, ఎంపీటీసీ మాదాసు సువర్ణ చందు, ఉపసర్పంచ్ కరుణాకర్, వివిధ కులసంఘాల నాయకులు తూండ్ల రాజయ్య, పాలరాజేశం, రాయనర్సు, సబ్బని రాజమల్లు, ఆడెపు రాజు, సీను, దంతెనపెల్లి స్వామి, సారంగపాని, రవియాదవ్, రఘు, గోలి సుధాకర్, తాండ్ర సురేశ్, నగేశ్, అనిల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ ప్రదానం





డాక్టరేట్ అందుకుంటున్న శ్యామల

ఓదెల: ఓదెల మండలం కొలనూర్ గ్రామానికి చెందిన దరిపెల్లి శ్యామల ఉస్మానియా యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగంలో పీహెచ్‌డీ డాక్టరేట్‌ను మంగళవారం అందుకున్నారు. యూనివర్సిటీ 83వ స్నాతకోత్సవ కార్యక్రమంలో భాగంగా గవర్నర్ తమిళి సై సౌందరా రాజన్, ఓయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ రవీందర్ చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకున్నారు. శ్యామలకు డాక్టరేట్ రావటం పట్ల కొలనూర్ గ్రామస్తులు అధ్యాపకులు, హర్షం వ్యక్తం చేశారు.

## ఉపాధ్యాయురాలి బ్యాగులోంచి నగదు మాయం

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని రమేశ్‌నగర్‌లో గల మహాత్మా జ్యోతి బాపులే బాలికల గురుకుల పాఠశాల (గుంజపడుగు)లో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలి బ్యాగులోంచి రూ.4వేల నగదు మాయమైంది. కాగా సదరు ఉపాధ్యాయురాలు స్వీపర్లపై అనుమానంతో వారికి పసుపు నీరు తాగించి దుస్తులను చెక్ చేసిందని స్వీపర్లు తెలిపారు. తమను అవమానించారని నలుగురు స్వీపర్లు ఆందోళకు దిగారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ మంజులను వివరణ కోరగా ఎవరిని అవమానించలేదని తెలిపారు. నగదు పోయిన విషయం వాస్తవమేనని, దీనిపై పోలీసులకు కూడా సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

# నియోజకవర్గ అభివృద్ధికి కృషి



ఆలయంలో పూజలు చేస్తున్న సంధ్యారాణి

యైటింక్లయిన్ కాలనీ: రామగుండం కార్పొరేషన్ పోతనకాలనీలోని దుర్గామాత ఆలయంలో బుధవారం కందుల సంధ్యారాణి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మహిళలకు ఉపాధి అవకాశాలతో పాటు నియోజకవర్గం అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు మూకిరి రాజు, శశి, కుమార్, కండె సాగర్, పాషా, మల్లయ్య, లింగయ్య నాయక్, ప్రసాద్ గౌడ్ మహిళలు పాల్గొన్నారు.

**బీజేపీ కార్యాలయం ప్రారంభం**

రామగుండం: అంతర్గాం మండలకేంద్రంలో బీజేపీ కార్యాలయాన్ని మంగళవారం రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థి కందుల సంధ్యారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రానున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో అంతర్గాం బీజేపీ మండల అధ్యక్షుడు బోడకుంట జనార్దన్, బాలసాని సత్తయ్యగౌడ్, కందుల సత్తయ్య, ఆకునూరి కరుణాకర్, మాదాసి శంకర్, కొమురయ్య, పర్వతాలు, రాజేందర్, లక్ష్మణ్, రాకేశ్, రమేశ్ గౌడ్, చిలుక శంకర్, శంకర్, రమేశ్, నరేశ్, వెంకన్న తదితరులున్నారు.




## నిఘా నీడన ఈసీ



ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ఓటర్లు ప్రలోభాలకు లోనుకావద్దని స్వచ్ఛందంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని ప్రజలను చైతన్య పరుస్తున్నారు. రాజకీయ పార్టీలకు పోలీసులు వత్తాసు పలకకుండా, పోలీసులు పార్టీలకు అనుకూలంగా వ్యవహరించకుండా నిఘా నీడలో చెకింగ్‌లు ముమ్మరం చేస్తోంది. ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించినా, సీవిజల్ యాప్, టోల్‌ఫ్రీ 1050 నంబర్‌కు వచ్చిన సమాచారం, ఫిర్యాదులను జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

## ఆధారాలు చూపి నగదు తీసుకెళ్లొచ్చు



విచారణ జరుపుతున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున తనిఖీల్లో భాగంగా స్వాధీనం చేసుకున్న నగదుకు సంబంధించి తగిన ఆధారాలు చూపి సొత్తును తీసుకెళ్లవచ్చని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. రూ.50వేల కన్నా ఎక్కువ మొత్తం సీజ్ అయితే రసీదు అందిస్తారని పేర్కొన్నారు. జిల్లాలో రూ.97లక్షల 86,860 నగదు జప్తు కాగా, ఆధారాలు చూపినందున మొత్తం అందించనట్లు తెలిపారరు. 30 డీజే బాక్సులతో పాటు సెల్‌ఫోన్లకు సంబంధించి ఆధారాలు చూపకపోవడంతో ఇవ్వలేదన్నారు.

# ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

- రెండేళ్ల జైలు శిక్ష విధించిన కోర్టు

గోదావరిఖనిటౌన్: ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.2.50లక్షలు తీసుకొని మోసగించిన కేసులో గోదావరిఖని కల్యాణ్‌నగర్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి ఎరవెల్లి రమేశ్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ గోదావరిఖని రెండో అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ దుర్గం గణేశ్ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గోదావరిఖని శివాజీనగర్‌కు చెందిన కారెంగుల నర్సయ్య రమేశ్ వద్ద చీటి వేశాడు. తనకు రాజకీయ నాయకుల అండ ఉందని, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని రమేశ్ చెప్పడంతో నమ్మిన నర్సయ్య తన కుమారుడైన సతీశ్‌కు ఉద్యోగం ఇప్పించాలని కోరాడు. రూ. 5.50లక్షలు అవుతాయని, మొదట రెండున్నర లక్షలు ఇవ్వాలన్నాడు. రూ.లక్ష రమేశ్ భార్య చంద్రకళ తనకు బ్యాంకులో వేయగా మిగతా లక్షా యాభైవేలు నర్సయ్య చెల్లించాడు. తన కుమారుడికి ఉద్యోగం ఇప్పించకపోవడంతో నర్సయ్య తన డబ్బులను తిరిగి ఇవ్వాలని కోరాడు. డబ్బులు ఇవ్వకపోగా బెదిరింపులకు పాల్పడడంతో నర్సయ్య అప్పటి గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై ప్రస్తుతం సీపీఎస్, సీఐ దేవయ్యకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. విచారణ చేపట్టి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా అనంతరం ఏపీపీ నహేదా ఫర్వీన్ ప్రాసిక్యూషన్ తరపున వాదన వినిపించారు. సాక్షులను విచారించిన జడ్జి రమేశ్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.